సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 మార్చి, 2011 సంచిక : 10

(వికృతి నామ సం॥, ఫాల్గుణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు**

**(సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | .......... రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 08685-326053**
**9440413455, 9848133565**

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి ........ 2
మార్చి నెల సాయిధామంలో.... ........ 4
శ్రీ రమణుల బోధ ........ 5
బాలవాణి ........ 6
కనుగొంటినీ .... ........ 7
మాతృసందేశం ........ 8
మూడు మలుపులు ........ 11
శ్రీ మద్భగవద్గీత-ప్రయోజనం ........ 13
ఆశ్రమ ధర్మములు ........ 15
పాఠకులారా స్పందించండి ........ 16
ప్రపంచంలో చెట్టు లేకపోతే ........ 18
ఆదిగురువు-దత్తప్రభువు ........ 19
ఇది నా గడ్డ ........ 22
లక్ష్మణుని తల్లి ........ 23
సమయం అమూల్యం ........ 27
మాతృసంస్థ కబుర్లు ........ 29
ఆదర్శం-నేటి సమాజం ........ 31







# మా వాణి



ప్రియ పాఠక మహాశయులందరికీ శుభాకాంక్షలు.

మార్చి 2వ తేదీ మహాశివరాత్రి. ఆ రాత్రి భూమిపైన శివలింగం ఉద్భవించిందని ఆర్యోక్తి. పరమశివుడు విరాగత్వానికి ప్రతిబింబం. ఆయన లోకోపకారానికి ప్రసిద్ధుడు. కపటమెరుగని నిర్మలచిత్తుడు. భోళాశంకరుడు, ఉబ్బుశంకరుడు అని పేరు పొందిన మాయారహితుడు. కామినీ కాంచనాలను గెలవగలిగిన వారు సృష్టిలో వేళ్ల మీద లెక్కించడానికి దొరికితే గొప్పే. అలాటి వారిలో సర్వశ్రేష్ఠుడు పరమేశ్వరుడు. ఆయన సర్వజ్ఞుడు. ప్రపంచంలో అందరికీ నుదుట మూడవ కన్నుంటుందనీ, జ్ఞానం వికసించిన వారికి మాత్రమే అది స్పష్టంగా కన్పిస్తుందనీ అంటారు. ఆయన సర్వజ్ఞుడైన కారణంగానే ముక్కంటి అయినాడు. నిత్యతపస్వి ఈశ్వరుడు. సదాశివుడు - అంటే ఎల్లవేళలా శుభాలను చేకూర్చేవాడని అర్థం. అలాంటి శివుడు భూతలిపై ఆవిర్భవించిన వేళ శివరాత్రి.

శ్రీ మహావిష్ణువు నాభిలోని కమలంలో జన్మించిన బ్రహ్మదేవుడు తండ్రి కన్నా తానే గొప్పవాడినని అహంకరించి వాదుకు దిగాడు. అంతలో వారి ముందు దివ్యప్రభలతో ఒక పెద్ద స్తంభం ప్రత్యక్షమైంది. దాని తుదీ మొదలూ కూడా కన్పించటం లేదు. ఆది కనుక్కోవడానికి తాను వెడతాననీ, అంతం తెలుసుకోవడానికి బ్రహ్మను వెళ్లమనీ అన్నాడు విష్ణువు. అటుపైన ఆయన వరాహరూపంలో నేల తవ్వుతూ పాతాళం దాకా వెళ్లాడు. కానీ ఆ స్తంభానికి మూలం ఎక్కడో, ఆయనకు తెలియరాలేదు. ఊర్ధ్వలోకాలన్నీ శోధిస్తూ వెళ్లిన బ్రహ్మకు ఆ స్తంభపు అంతమెక్కడో అంతుచిక్కలేదు. అంతలో ఆయనకొక గోవూ, మొగలిపువ్వూ కన్పించాయి. వాటిని సాక్షులుగా వేసుకొని తాను గెలుపొందాననిపించుకోవాలనుకొన్నాడు బ్రహ్మదేవుడు. వారిని వెంటబెట్టుకొని భూమి మీదికి రాగానే విష్ణువు ప్రశ్నించాడు. "ఏమైనా తెలుసుకోగలిగావా?" అని. వెంటనే బ్రహ్మ తానా

స్తంభపు కొస చూచాననటమేగాక తన సాక్షులను కూడా చూపించాడు. ఆవు అవునవునని తలఊపింది. తోక మాత్రం అడ్డుగా ఊపింది. మొగలిపువ్వు స్పష్టంగానే సాక్ష్యమిచ్చింది. విష్ణువు సహజంగా సత్త్వస్వరూపుడు గనుక ఓటమి అంగీకరించాడు.

అంతలో పరమేశ్వరుడక్కడ ప్రత్యక్షమయ్యాడు. నిజాయితీతో నిలబడిన విష్ణువును అభినందించాడు. అసత్యం చెప్పిన బ్రహ్మకు పూజలమరరాదని శపించాడు. అబద్ధపు సాక్ష్యమిచ్చినందుకు మొగలిపువ్వు పూజకు పనికిరాదని నిషేధించాడు. గోవు తోకతో సత్యం చెప్పినందున దాని పృష్ఠభాగం నమస్కార యోగ్యమనీ, వేకువనే ఆవు ముఖం చూడటం పాతకమనీ శాసించాడు. "బ్రహ్మంతటివాడు అడిగాడు గదా" అని చేతులారా దోషానికి పాల్పడిన మొగలీ, గోవూ కూడా మనకు గొప్ప సందేశం యిస్తాయి- "ధర్మం ముందు ఎంతటి మొనగాడైనా తలవంచవలసిందే, తమ దుష్కృత్యానికి ఫలితం అనుభవించవల సిందే" అని. అలా వచ్చింది శివలింగం శివరాత్రి నాడు.

శివుడు స్వయంగా రుద్రుడు. ఆయన రౌద్ర శక్తి ముందు విశ్వమంతా తలవంచుతుంది. అదే ప్రళయం. అందుచేతనే తాను అభిషేకప్రియుడైనాడు. క్షీరసాగరమధన వేళ పరమేశ్వరుడు చూపిన త్యాగం, వివేచన ఎంతో అద్భుతమైనవి. "పర హితము సేయునెవ్వడు పరమహితుండగు భూత పంచక మునకున్" అని హాలాహలాన్ని అవలీలగా ఆరగించిన దయాళుడతడు. కడుపులోని జగాలకు చేటు కలగరాదని ఆ గరళాన్ని కంఠాననే నిలిపి కళంకరుడైన ప్రేమస్వరూపుడు.

అహంకారాన్ని తనకు వాహనంగా చేసుకొని, ఆశ్రిత వాత్సల్యంతో తలపై నెలవంక తురాయి పెట్టుకొని, బుసలుకొట్టే కోరికలకు తాను లొంగక-వాటిని హారాలుగా వేసుకొని, వైరాగ్యచిహ్నమైన బూది ఒళ్లంతా పులుముకొని, కపాలం చేత పట్టుకొని, సమభూమి అయిన వల్లకాటినే నివాసంగా చేసుకొని సంచరించే ఈశ్వరుడు - ఆధ్యాత్మిక చింతనాపరులైన వారందరికీ ఆరాధ్యుడే.

శ్రీ సాయినాధులవారు నిత్యభిక్షతో గడిపారు. చింకిపాతలు తొడుక్కొని, కూలనున్న మసీదే కాపురంగా చేసుకొని, నిత్య ధ్యానంలో ఉండేవారు. మూడు





రోజులపాటు తనువు విడిచి వెళ్లి తిరిగి అందులో ప్రవేశించి, తాను మృత్యుం జయుడినని చాటుకొన్నారు. అలాటి శ్రీ సాయీశ్వరునికి శివరాత్రి నాటి రేయి అభిషేకాలు చేద్దాం. ఆ వైరాగ్య లక్షణాలను అలవరచుకుందాం. బ్రహ్మచర్యంలో తేజోమయులుగా, సంసారంలో సన్యాసులుగా, సన్యాసులలో సర్వశ్రేష్ఠులుగా శివాంశలో లయించిపోయే ప్రయత్నం చేద్దాం.

✡

## మార్చి నెల సాయిధామంలో ...

| | | |
|---|---|---|
| మార్చి 2వ తేదీ | ఉదయం | శ్రీ సాయీశ్వరునికి అభిషేకం |
| మహాశివరాత్రి | | మారేడు దళాలతో పూజ |
| | మధ్యాహ్న హారతి - 12 గం. | |
| | సాయం హారతి - గం.6-30 ని.లకు | |
| | రాత్రి - గం.7-00 నుండి శివనామ సంకీర్తనం, భజన, శివునిపై క్విజ్, చిరుతొండనంబి కథ, లింగోద్భవ గాథ | |
| మార్చి 20వ తేదీ - | | రక్తవర్ణ పుష్పాలతో పూజ, వసంతోత్సవం (మోదుగు పూల రసంతో మాత్రమే) |
| మార్చి 21వ తేదీ - | | పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి జన్మదినోత్సవం |
| | ఉదయం | 9 గం.లకు - 72 దీపాలతో సాయికి అర్చన |
| | | 10 గం.లకు - గురు పూజ |
| | | 10-30కు - గురుస్తుతి, పుస్తకావిష్కరణ |
| | | 11 గం.లకు - గురు ప్రవచనం |
| | | 11-30 - గురువుల నమస్కృతులు, గురుదేవుల ఆశీస్సులు |
| | | 12-00 - మహాహారతి |
| | | 1-00 - అన్నప్రసాద వినిమయం |



# శ్రీ రమణుల బోధ

దేహం మృణ్మయవజ్జడాత్మక మహం
బుద్ధిర్న తస్యా: తతో
నాహం త, త్తదేవత సుప్తిసమయే
సిద్ధాత్మ సద్భావత: ।
కోహం భావయుత:, కుతో, వరధియా
దృష్ట్వాత్మ నిష్ఠాత్మనాం,
సోహం స్ఫూర్తితయారుణాచలశివ:
పూర్ణో విభాతి స్వయమ్ ॥

- మానవ దేహం కుండలాగా నిర్జీవ (జడ) పదార్థం. దీనికి "నేను" అనే ఆలోచన లేదు. పైగా దేహం అంటూ ఉన్నదన్న స్పృహే లేకుండా మనం నిద్రపోతున్నప్పడు కూడా 'నేను' ఉండటం చేత దేహం అన్నది నేను కాదు. మరి యీ 'నేను' ఎవరు? ఎక్కడ ఉన్నాడు? అని పరిశీలించి వెదకి చూచి, చివరికి ఆత్మ నిష్ఠ కలిగిన వారు 'అతడే నేను' అంటే పరమాత్ముడే నేను అని భావించటం ప్రారంభిస్తారు. అలా ఆత్మలో ఉన్న తనను గ్రహించగలిగినట్టి వారి హృదయాలలో పరిపూర్ణ తేజంతో స్వయంగా స్థిరంగా నిలచి ఉంటాడు అరుణాచలేశ్వరుడు.







# బాలవాణి ఏది పేదరికం ?

- మాతాజీ

అనగనగా ఓ ఖరీదైన - అంటే బాగా ధనవంతుడైన ఓ తండ్రి తన చిన్నారి కొడుకును వెంటబెట్టుకొని, పల్లెటూళ్లు ఎలా ఉంటాయో చూపించాలనుకొని తీసుకువెళ్లాడు. అక్కడి జనజీవనాన్ని, వాళ్ల పేదరికాన్నీ చూపించాలన్నది ఆయన ప్రధాన లక్ష్యం - అక్కడి సుందరదృశ్యాలనూ, పాడిపంటలనూ, ప్రశాంతతనూ కాదు సుమా! వీళ్లిద్దరూ అక్కడున్న ఒక నిరుపేద యింట్లో రెండు రోజులున్నారు. తిరుగుప్రయాణం ప్రారంభమైంది.

తానెంత సమర్థుడో, ఎంత శ్రమించి యింత సంపద కూడా బెట్టాడో, తద్వారా తన కొడుక్కు తానెంత సౌఖ్యాన్ని కలుగజేస్తున్నాడో పిల్లవాడికి తెలియ జెయ్యాలనుకొని సంభాషణ ప్రారంభించాడు తండ్రి. "చూచావా బాబూ! పేద వాళ్లు ఎలా బ్రతుకుతారో!" "అవున్నాన్నగారూ! అద్భుతంగా బ్రతుకు తున్నారు" అన్నాడు కొడుకు. "అలాగా! అదెలాగో చెప్పు" అన్నాడు తండ్రి.

"మనింట్లో ఒక్క కుక్కను పెంచుతున్నాం- వాళ్ల యింటి దగ్గర నాలుగు కుక్కలున్నాయి. మన తోటలో ఓ చిన్న నీళ్ల గుంట తవ్వుకున్నాం. కాకపోతే దానికి చక్కగా గట్లు కట్టాం. వాళ్లకేమో పొలం పొడవునా ఒక వాగున్నది. మన చిన్న తోటలో మనం దీపస్తంభాలు పెట్టి లాంతర్లు వెలిగించుకొంటున్నాం. వాళ్లకేమో వెలుగిచ్చేందుకు బోలెడన్ని చుక్కలున్నాయి. మనం కాస్త మంచిగాలి కావాలన్నా, హాయిగా కాలక్షేపం చేయాలన్నా పార్కులకు వెడతాం. వాళ్లు ఉన్నదే పార్కులో అన్నట్లుగా ఇళ్ల చుట్టూ చెట్లు, మంచిగాలీను. మనం ఉండటానికి కాస్తంత చోటుంది ఇంట్లోనూ చుట్టూ తానూ. వాళ్లకు విశాలమైన విడివిడి ఇళ్లు, పెద్దవాకిళ్లు ఉన్నాయి. మన యింటికి కాపలావాడు కావాలి. వాళ్లకేమో చుట్టూ ఉన్న మిత్రులే రక్షిస్తారు. మన పట్టణంలో ఒక యిల్లు అంటుకుంటే ఫైరాఫీసుకు ఫోన్లు చేస్తాం - వీళ్ల ఊళ్లో అలాటిది జరిగితే ఊరంతా ఒకటై ఆర్పేసుకుంటారు". తండ్రికి వాడి మాటలు వింటే నోట మాట రాలేదు. పైగా ముక్తాయింపుగా పిల్లవాడిలా అన్నాడు -''ఇన్నాళ్లూ మనమేదో ధనవంతులమనుకొన్నాను. కానీ ఎంత పేదవాళ్లమో నాకిప్పడర్థమైంది. నన్నిక్కడికి తీసుకు వచ్చినందుకు థేంక్స్ నాన్నా!"

# కనుగొంటినీ...

- శ్రీ ముప్పాళ్ల దశ్వంతరావు, విజయవాడ

1. చూచితి సాయిధామమును, అందు వసించెడు బాల బాలికల
పెంపువహించెడు మాతృమూర్తి శుకవాణిని, నే గాంచితి కన్నుల
పండువుగాగ పూజ్య గురుదేవులు శ్రీ సత్య పదానంద స్వామిని
పున్నమి చంద్రుడోయనంగ చల్లగ లేగల సాకు చందమున్!

2. అమ్మల గన్నయమ్మ దుర్గమ్మ ప్రేమ వర్షింప ఎన్బది
నాల్గు లక్షల జీవరాసులు ధరవసించుట వింటి; నేడు
సాయిధామమున ముద్దుల తోడ విద్దెలను చిరు ముద్దులు
గా బుద్ధుల గుడిపించు ప్రేమ మూర్తుల గంటిన్!

3. ప్రేమ మీరంగ శిరిడి దేవుడెకరుణించె ననంగ సాయి
ధామంపు వేలుపె మెల్ల మెల్లన నేతెంచె అమ్మకోరిన యంతన్
స్వామి నయనాల వెల్లులు నామది సోకినంత, నా శోకము
లెల్లబాసి వ్రాలితి స్వామి చరణాల నిండు భక్తితో!

4. ఆకలి దప్పలెరుంగక, స్వామి వదనారవిందమె తదేక రీతిగా
జూచుచు నుండ సాపడ రండన్న పిలుపు మరి మరి విని! నేనట
కేగ బిరబిర పసిపాపలు సాదరముగ వడ్డింప కాంతు
లీనెడు వారి మోముల తిలకింప నాకు అచ్చెరువయ్యెన్!

5. పూర్వాశ్రమంబున 'సత్యనారాయణ' యనంగ విద్యా
ధికుడాతండు ఆశ్రమ తీర్థము సేవించి 'ఆనందం' బయ్యె
ఆనిష్కామియె మము దోడ్కొని పోయి సాయిధామపు శాఖల
నెల్ల జూపి। ఓర్మి వివరించె నాశ్రమంపు పుట్టుపూర్వోత్తరముల్

6. ఎంత ఆశ్చర్యమోగద ఎంచి చూడ। కొండల గుట్టల నడుమ
వర్ధిల్లు। 'ఉష', 'ప్రశాంతి', 'ఆరోగ్య', 'వృద్ధాశ్రమాలు'। అంతి
యేగాక అటనుండె 'సురభి' 'ధర్మజ్యోతి' 'ద్వారవతి' 'సాధన'
'మాతృ వేదిక' 'అన్నపూర్ణలు' గురుదేవు సంకల్ప మహిమ।





7. అల్లన ఘల్లుమటంచు మ్రోగ। నే గ్రక్కున లేచితి వింత
జూడ, మల్లెలబోలు పిల్లలు సెలయేరులా కళకళ
లాడుచు బారులు దీరిరట, నాటికి చదువుల తల్లి సెలవిచ్చె
నేమొ మాత ఒడి జేరిరి - ఎంతటి భాగ్యశాలురో గదా।

8. సుందరంబుగ వెలసె నట దివ్యపురుషుని మందిరంబు
చూడచిన్నదె గాని భావన కందనంత మిన్న। శిల్పచాతు
ర్యమున్ జాటురంగుటిల్లు। సాయి విగ్రహమా అటనున్నది
కానె కాదు। సాయియే నిల్చెనట దాసజనుల నెల్ల బ్రోవ।

9. అటుల యోచించు చుంటి నే కొంత తడవు। కాలమాగునా
నే మేను మరచియున్న - మాయలోకాన మరల నేమసల వలయు -
స్వామి పాదాలు తాకి సెలవడుగు చుండ, నొక్క కోరిక నామది
జనించె "స్వామి కరుణింపనుందు నిట। తుదిశ్వాస వీడు వరకు"।
ఓం సాయిరాం ..... ఓం సాయిరాం .... ఓం సాయిరాం ......

## [illegible]

(గత సంచిక తరువాయి)

- శ్రీ మల్లెమాల

సీ. ఎందరో మహనీయు లేండ్ల పర్యంతము
మౌనమ్ముగా జైళ్ల మ్రగ్గినారు !
ఎందరో మహిళలు - ఇళ్లు వాకిళ్లను
విడిచి భర్తల వెంట నడచినారు !
ఎందరో రచయిత లేకోన్ముఖమ్ముగా
దేశభక్తిని ప్రబోధించినారు !
ఎందరో విద్యార్థు లెగసి ఉద్యమమందు
దూకి దిక్కుల కెగబ్రాకినారు! 1

తే. ఒక్కరేమిటి? బహువిధోద్యోగి గణము
లన్ని వృత్తుల పనివార లడుగు కలిపి

కదనుద్రొక్కుచు సాగిన ఘటన నరసి
తెల్లదొరలకు గుండెలు ఝల్లు మనియె.
ఆ మహోద్యమమం దసంఖ్యాకులైన
కన్నబిడ్డల గోల్పోతి కనులముందె!
వారి బలిదాన మెదనిండ వగపుకన్న
రాగరంజితమ్మైన గర్వమును నింపె. 2

ఆ. కులమతములు మరచి కోట్లాది ప్రజలొక్క
త్రాటిపైన నిలిచి సాటిలేని
సరణి సలిపినట్టి శాంతి సంగ్రామము
తెల్లదొరల మదము కొల్లగొట్టె. 3

తే. ప్రళయభీకరమగు ప్రజాబలము ముందు
సాగ దికమీద భరతదేశమ్మునందు
ఇమ్ము దరిగిన మనపెత్తనమ్మటన్న
నిజము గుర్తించి ఆంగ్లేయనేతలెల్ల. 4

ఆ. ఓడలెక్కి వారు ఊరకపోలేదు
కుటిలతంత్రములను కుప్పవోపి
ఆరనట్టి జ్వాల లన్నదమ్ముల మధ్య
రేపి శాంతిరూపు మాపినారు. 5

శా. ఆ కల్లోలము నా శరీరమును బాహాటమ్ముగా రెండుగా
లోక మ్మచ్చెరువంద చీల్చినది; నాలో శోక ముప్పొంగె; నా
చీకాకున్ మదిలోనె దాచుకొని నా చింతన్ దిగన్రింగి, నే
పాకిస్తానుకు సమ్మతించి అటులే బాపూజి నొప్పించితిన్. 6

తే. జవహరాదిగ తక్కిన శాంతి దళము
తలలు వంచిరి ముందుగా తల్లి చెరను
బాపి జయకేతనమ్మును లేపవలయు





హస్తినాపురి కోటపై యని దలంచి. 7

తే. ఇన్ని కష్టాలకోర్చి దక్కించుకొన్న
దివ్య స్వాతంత్ర్య మీనాడు దీనసైన
నన్ను తిలకించి పకపక నవ్వుచుండె!
మానస మ్మగ్నికుండమ్మై మండుచుండె. 8

ఆ. రామచరితమ్మైన రామాయణమ్మును
తలచుకొనిన మేను పులకరించు
అందులోని పాత్ర లనుదినమ్మును నాకు
జ్ఞప్తివచ్చి మిగుల గర్వపడదు. 9

తే. ఘనుడు శ్రీరామచంద్రుని కారణమున
యుగయుగమ్ముల నుండి యీ యుగము వరకు
పయన మొనరించి నేటికి బ్రతికియున్న
మధుర మంజుల గాధ రామాయణమ్ము. 10

తే. దారితప్పిన మనుజుల ధర్మమార్గ
మునకు మళ్ళించు రాముని ఘనచరిత్ర
నీవు నీదైన శైలిలో నేటి తరము
కొరకు చెప్పుము మిక్కిలి త్వరితగతిని. 11

ఉ. ఇంతకు ముందు రామకథ నెందరో పండిత సత్కవీంద్రు ల
త్యంత రసోత్కటమ్మగు విధమ్మున వ్రాసిరి, వారి ముందు, నే
నెంతటివాడనంచు మదినెంచక పామరరంజకమ్ముగా
చింతనజేసి చెప్పమని చెప్పెను భారతమాత ప్రేముడిన్. 12

తే. ఆ మహామాత ఆదేశ మనుసరించి
భారతమంతయు రామునిపైన వైచి
తలకుమించిన బరువని తెలిసికూడ
తలను వంచితి నిది సుకృతమ్మటంచు 13

# మూడు మలుపులు

–ప॥పూ॥మాధవరావ్ గోళ్వాల్కర్ జీ.

(ఇది రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారి కార్యకర్తలను గురించి చెప్పినది. కానీ, ఏ సంస్థ పూర్ణ సమయ కార్యకర్తకైనా అన్వర్తించేదే. అంచేత చదువుదాం.)

ఇటీవలి కాలంలో మనసుపైన నియంత్రణ చెదురుతున్న కారణంగా నిరంతరం ఒకే పనిని చేసే ప్రవృత్తి తగ్గుతున్నది. కొంతమంది నాలుగు రోజుల పాటు ఒక పనిని చేసి మధ్యలోనే వదిలేసి మరొక పనిని చేపడతారు. ....... అని వాదిస్తూ ఉంటారు. తరచూ పనులు మారుస్తూ ఉండటం వారికి ఆనందాన్ని కలిగిస్తూంటుంది.

ఇలాంటి వికృతులు ప్రజల్లో ఎక్కువవుతున్నాయి. ఒక పశువును మేత కోసం ఒక పొలంలో వదిలిపెడితే అది మంచిగడ్డి ఒకే దగ్గర ఉన్నప్పటికీ అక్కడ మేయకుండా అటుఇటూ తిరుగుతూ ఉంటుంది. కొంత ఇక్కడ, కొంత అక్కడ, మరికొంత ఇంకొకచోట మేస్తూ పొలమంతా తిరుగుతూ ఉంటుంది. ఇంకొక పశువు అదే పొలంలో మేస్తూ ఉంటే దానిని తిననీయకుండా దాంతో తగాదా పెట్టుకొని అక్కడున్న మేతను లాక్కునే ప్రయత్నం చేస్తుంది. ఇలాంటి లక్షణాలే మనుషుల్లో కూడా పెరుగుతున్నాయి. నిరుపయోగమైన అరిష్టకారకమైన ఇలాంటి లక్షణాలకు మనం ఎవ్వరం బలి కాకూడదు. మనం స్థిరనిశ్చయులమై ఉండాలి. ఇది నా జీవనకార్యం. దీనిని నిరంతరం కొనసాగిస్తూ ఉంటాను. ఇతరులు చేసినా, చేయకపోయినా పట్టించుకోను అన్న ఆలోచనలను హృదయాన ధరించి నిత్యం ముందుకుసాగుతూ ఉండాలి.

అందరిలాగానే మనం కూడా సినిమాలకు, షికార్లకు, పిక్నిక్‌లకు, గానాబజానాలకు వెళ్ళి ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ ఉంటామని యువకులు అనుకుంటూ ఉంటారు. కాని, వీటన్నిటికీ మనం దూరంగా ఉంటున్నాం. సరదాగా కాలం గడుపుతున్న యువకులు సహజకార్యం చేయాల్సిన అవసరాన్ని మర్చిపోతుంటారు. సాధారణంగా మనుష్యులు ఒక కార్యం చేపట్టిన





తరువాత అనేక కారణాల వల్ల మార్గం నుంచి తప్పకుంటుంటారు. పరమ పూజనీయ డాక్టర్‌జీతో పాటు సంఘకార్యం చేస్తున్న మన కార్యకర్త ఒకరున్నారు. ఒక వ్యక్తి జీవితంలో ప్రధానంగా మూడు మలుపులుంటాయని ఆయన చెబుతుండేవారు. ఈ మలుపుల సందర్భాల్లో వారి వారి ఆలోచనా ధోరణులు మారే అవకాశాలుంటాయి. బాల్యంలో ఒక స్వయం సేవక్ శాఖకు వస్తాడు. ఉత్సాహంతో ఆటపాటల్లో పాలుపంచుకుంటుంటాడు. శాఖలోని మిగిలిన వారంతా అతనిని కూడా తమతో సమానంగా చూస్తారు. కాబట్టి ఆనంద పడతాడు. ఆ తరువాత అతడు విశ్వవిద్యాలయంలో చదవటానికి వెళ్ళినప్పడు వాతావరణం మారిపోతుంది. కొత్త కొత్త వ్యక్తులు మిత్రులౌతారు. కొత్త కొత్త పుస్తకాలు, కొత్త కొత్త మాటలు వినపడుతూ ఉంటాయి. అప్పడతడి ఆలోచనా ధోరణిలో మార్పు వస్తుంది. ఇప్పడు తాను యుక్తవయస్కుడను అయ్యానని ఉల్లాసపూరిత వాతావరణంలో సరదాలూ, స్నేహితులతో సౌఖ్యాలను అనుభవించాలని కోరుకుంటాడు. విశృంఖలంగా జీవించే పద్ధతిని ఇష్టపడతాడు. ఎలాంటి బంధనాలూ, క్రమశిక్షణ అతడికి నచ్చవు. అప్పడతడు తన కార్యం నుంచి నెమ్మదిగా తప్పకుంటాడు.

చదువు పూర్తయిన తరువాత ఉదర పోషణార్థం. అటు ఇటు తిరుగుతూ చిన్న చిన్న పనులు మొదలుపెట్టినప్పడు జీవితంలోని రెండవ మలుపు ప్రారంభమవుతుంది. ఉద్యోగం దొరికిన తర్వాత చేతిలో నాలుగు డబ్బులు ఆడడం ప్రారంభమవుతుంది. కొంతమందితో సరదాలు, పార్టీలు, చేసుకుంటూ ఉంటారు. సమాజంలో తానొక ప్రతిష్ఠ కలిగిన వ్యక్తినని భ్రమపడుతూ ఉంటాడు. నేను నిక్కర్ ఎందుకు వేసుకోవాలి? చేతిలో దండ పుచ్చుకొని ఎలా నడవను? నేను సంఘానికి వెళ్ళడం నా యజమానికి ఇష్టమో కాదో? ఇలాంటి అనేక ఆలోచనలు అతని మనసులో ముసురుతూ ఉంటాయి. ఒకవేళ అది ప్రభుత్వోద్యోగమయితే సంఘానికి వెడితే తమ ఉద్యోగం ఎక్కడ పోతుందోనన్న భయం మనసును వేధిస్తూ ఉంటుంది. ఒకసారి ఒక పెద్దమనిషి నాతో ఇలా అన్నాడు - "నేనిప్పడు ప్రభుత్వ ఉద్యోగిని. ఏం చేయాలి? శాఖకు రాలేను". అప్పడు నేను - "నిన్ను ప్రభుత్వ ఉద్యోగం చేయమని ఎవరన్నారు? ప్రభుత్వంలో ఉన్నవారు నీ కాళ్ళు

పట్టుకొని బతిమిలాడి, బలవంతంగా ఉద్యోగం ఇచ్చారా? ప్రభుత్వ ఉద్యోగం చేయడం వల్ల సంఘ కార్యానికి ఇబ్బంది ఏర్పడుతుందని అనిపించినప్పడు మరి ఆ ఉద్యోగం ఎందుకు చేపట్టినట్లు? నా మొట్టమొదటి ప్రాధాన్యత సంఘమే. ప్రభుత్వ ఉద్యోగం కాదు అని వారికి చెప్పి వుండాల్సింది" అని అన్నాను. హృదయ దౌర్బల్యం కారణంగా ఇలాంటి ఆలోచనలు మాటలు వస్తుంటాయి. వ్యాపారాలు చేస్తున్న వారు ఉదయం నుంచీ సాయంత్రం వరకు దుకాణాల్లో కూర్చుని ఉండటం వల్ల అలసిపోయామని కుంటిసాకులు చూపిస్తారు. వీటన్నింటి వెనుక బలహీనమైన మనస్సే ప్రధాన కారణంగా కనబడుతుంది. ఇది జీవితంలో రెండవ మలుపు. ఇక్కడ అతను సంఘ కార్యం నుంచి దూరం జరుగుతూ ఉంటాడు.

**(సశేషం)**

# శ్రీ మద్భవద్గీత-ప్రయోజనం

– శ్రీ తాతపూడి బ్రహ్మానందశాస్త్రి

అనిత్యమైన సుఖదు:ఖాలు, మన శరీరము వున్నపుడే ఇంద్రియాల ద్వారా ఆయా వస్తువుల మీద ఆధారపడి వస్తాయి. కనుక శరీరము, ఇంద్రియాలు లేకపోతే సుఖదు:ఖాలు వుండవు. నిజానికి శరీరము, ఇంద్రియాలు లేకపోవటం జరుగదు. కనుక శరీరము ఇంద్రియాలు ఎట్లా వచ్చినవో తెలుసుకొని, వాటిని అదుపులు పెట్టుకొంటే సుఖదు:ఖాలను అదుపులో పెట్టుకోవచ్చును. ఆత్మానందాన్ని పొందవచ్చును.

శరీరము ఎందుకు వచ్చిందంటే వెనుక జన్మలో ఏదన్నా కర్మ చేస్తే ఆ కర్మ ఫలాన్ని అనుభవించటానికి వచ్చింది. భూతకాలాన్ని మనం సరిదిద్దలేము. కాని వర్తమానం ద్వారా భవిష్యత్తును మనకు కావలసిన విధంగా తీర్చిదిద్దుకోగలము కదా! కనుక యిప్పడు కర్మ లేకుండా చేసుకొంటే, భవిష్యత్తులో సుఖదు:ఖాలకు మూలభూతమైన శరీరము రాదు. ఇక్కడ యింకొక తమాషా గూడ ఉన్నది. శరీరమంటే ఏమిటో తెలిస్తే మనకు భవిష్యత్తులో శరీరము కావాలా వద్దా అని నిర్ణయించుకొనే అవకాశమేర్పడుతుంది.

కర్మ లేకుండా చేసుకోవాలంటే కర్మ ఎందుకు చేస్తున్నామో తెలుసుకోవాలి.





మనకు తెలుసు - కర్మను రాగద్వేషాల మూలంగాను, కామక్రోధాల మూలంగాను చేస్తాము. ఇవి లేకపోతే కర్మ చెయ్యము.

రాగద్వేషాలు, కామక్రోధాలు లేకుండా ఉండాలంటే అవి ఎందుకు వచ్చినవో తెలుసుకోవాలి. అవి స్వపరభేదబుద్ధి వలన వచ్చినవి. అంటే నేను వేరు వాడు వేరు అనే బుద్ధి. ఈ స్వపరబుద్ధిపోతే రాగద్వేషాలు, కామక్రోధాలు పోతాయి.

స్వపర బుద్ధి పోవాలంటే అది ఎందుకు వచ్చినదో తెలుసుకోవాలి. ఇది ఎవరికి వారు తమ స్వరూపాన్ని తెలుసుకోకపోవటము వలన తెలుస్తుంది. దానినే ఆత్మజ్ఞానమంటారు. అది తెలిస్తే శరీరమును గురించి కూడ తెలుస్తుంది.

ఆత్మజ్ఞానము వలన, ఆత్మ ఒక్కటేనని, దానికి స్వపరభేదము లేదని, స్వపర భేదమున్న శరీరాలు ఆత్మ కప్పతున్న అనిత్యమైన ఆకృతులు మాత్రమేననీ, ఆ శరీరాలు ఉన్నా లేకపోయినా నష్టము లేదనీ తెలుస్తుంది.

ఈ ఆత్మజ్ఞానము ద్వారా, స్వపర బేధాలు, రాగద్వేషాలు, కామక్రోధాలు కర్మ, కర్మ వలన వచ్చే శరీరము, శరీరము వలన కలిగే సుఖదు:ఖాలు పోయి శాశ్వతానందాన్ని పొందగలుగుతాము.

ఈ ఆత్మజ్ఞానాన్ని గురించి విపులంగా తెలిపి మనకు శాశ్వతమైన ఆనందాన్ని కలుగజేస్తుంది - భగవద్గీతాబోధ. దీనిని సాక్షాత్తు భగవంతుడయిన శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పటం విశేషం. కనుక గీత చదవటం మనకు పరమప్రయోజన కరం అనటం నిశ్చయం.

ఒకరోజు తుర్గెనేవ్ అనే ఒక రష్యన్ రచయిత వీధిలో వెళ్తుంటే ఒక భిక్షకుడు ఎదురై చేయి చాచాడు. తుర్గెనేవ్ తన జేబులన్నీ వెతుక్కున్నాడు గానీ ఏమీ దొరకలేదు. భిక్షగాడేమో వణికే చేయి చాపి అలాగే నిలబడి ఉన్నాడు. తుర్గనేవ్ కొంచెం సిగ్గుపడ్డాడు. ఆ భిక్షకుడు చాపిన చేతిని తన రెండు చేతుల్లో ఆప్యాయంగా నొక్కుతూ, "క్షమించు సోదరా! నా దగ్గర ఏమియూ లేదు" అన్నాడు. భిక్షకుడు కన్నెత్తి తుర్గెనేవ్ కళ్లలోకి చూచాడు. శుభ్రమైన అతని చేతుల మధ్యలో ఉన్న తన మురికి చేతిని ఒకసారి చూచుకొన్నాడు. చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి. "నన్ను సోదరా! అన్నారు కదా! అంతకుమించి ఇంకేమీ అక్కర్లేదులెండి. అంతకన్నా పెద్ద కానుక ఏముంది?" అన్నాడు.



# ఆశ్రమ ధర్మములు

-శ్రీ సాయివర ప్రసాదరావు

**బ్రహ్మచర్యము :** ఉపనయనము - మొదలు వివాహమగు వరకు మధ్యనున్న కాలమును బ్రహ్మచర్య కాలమని అందురు. నియమబద్ధమైన జీవితము, బ్రహ్మ చర్యమునకు అవశ్య కర్తవ్యము. ఆ నియమాల గూర్చిన అవగాహన తెలుసుకొన దగినది. "గురు శుశ్రూషయు, నాగమాధ్యయనమున్ గోష్ఠీ నిరాసంబంధత్వరతన్ మేన్ దొడయంగదో జొరమియన్ భైక్షాశనత్వం బుషడ్వర కర్మంబుల యందు రాగభర గాఢద్వేషముల్ లేక యెవ్వరితోడంబగ గాక యున్కియును భవ్య బ్రహ్మచర్యోక్తముల్".

గురువు గారిని సేవించుట వేదములను చదువుట స్త్రీల సాంగత్యమును వాంఛించకుండుట, శ్రద్ధతో అలంకారములు చేసుకొనకుండుట. భిక్షాన్నముచే శరీర పోషణము గావించుట అనునవి బ్రహ్మచారికి అవశ్య కర్తవ్యములు.

షట్కర్మలనగా "ఇజ్యం" (జన్నము చేయుట), అధ్యయనము (వేదాధ్యయ నము), దానము (యోగ్యునకు తనకు కల్గిన మేరనిచ్చుట), యాజనము (ధనము గ్రహించి యాగము చేయుట), అధ్యాపనం (చదువు చెప్పట), ప్రతి గ్రహము (దానము పుచ్చుకొనుట). బ్రహ్మచారి రాగద్వేషాతీతుడై ఎవ్వరితోను పగలేక ఉండవలెను. ఆశ్రమ ధర్మములలో బ్రహ్మచర్యమును అనుసరించుట దుస్సాధ్యమైనను ఇదియే సర్వోత్తమమని చెప్పబడినది.

క్షమ, సత్యము, శౌచము అనునవి మంచివి, యోగ్యమైన ధర్మములు. బ్రహ్మచర్యము అత్యుత్తమ ధర్మము. ధైర్యమంటే క్షమాదులను, చిత్తమునకు అలవడునట్లు చేయవలెను. సుందర రమణుల యెడ పరిహాసము, వారితో ముచ్చటించుట, వారికై ఎదురు చూచుట వంటివి నింద్యములు. వీనికి తావిచ్చి నచో సుదతులు బ్రహ్మచారి హృదయములోనికి ప్రవేశింతురు. స్త్రీ దేహము మాంసమయమగు ఎముకల సముదాయమేనను భావము కలిగినచో చిత్తమునకు చాంచల్యము కలుగదు. దానికినాడీ విశుద్ధి ప్రాపగుచున్నది.

బ్రహ్మచర్యము బ్రహ్మవిద్యా ప్రాప్తికి మూలకారణమని వ్యాసుల వారు సెలవిచ్చి యున్నారు. బ్రహ్మచర్యముతో కూడిన తపమును వనమునందైనను వానప్రస్థ వాసులకడనైనను చేయుచు పర్ణశాలలకేగి భిక్షమెత్తుకొని జీవించవలయును. పొగడ్తగాని, అభివాదములు, అభివందనములు ఎంచక శుభాశుభములను చింతనను రానీయక, సరదా కబుర్లతో గడిపే వైపులకు పోకుండుట అనునవి బ్రహ్మచారికి నియమించబడిన నియమములు. అట్టి నియమముల వలన ఆధ్యాత్మిక విద్యను పెంపొందును. మేలు కలిగించును.

**(సశేషం)**





# పాఠకులారా స్పందించండి

~ సాధకుడు మౌనానంద

క్రమశిక్షణ జీవితములో ముఖ్యపాత్ర పోషిస్తుంది. క్రమము అనగా పద్ధతి. పద్ధతి అనగా జరగవలసినది జరగవలసిన విధానములో జరగడమే. అలా కాకపోతే క్రమము తప్పతుంది. క్రమము తప్పితే ఒకలా జరగవలసినది మరియొక విధంగా జరుగుతుంది. ప్రకృతిని పరిశీలిస్తే మనకు క్రమమంటేనేమో తెలుస్తుంది. ప్రకృతిలో జరిగే మార్పులు ఒక క్రమంలో వుండే వాటికి అనుగుణంగా మనము మన పనులను మార్చుకొంటాము. అక్రమము అంటే జరగవలసిన దాని కంటే భిన్న పద్ధతిలో జరగడము. అక్రమము సమస్థితిని కల్లోలపరుస్తుంది. సకాలంలో వానలు కురిస్తే పంటలు బాగా పండుతవి. అకాలంలో వానలు కురిస్తే పంటలు పండకపోగా, నాశనమవుతాయి, పంటలు చేతికి రావు. నష్టాలు వస్తవి. మనిషి ధర్మముగా జీవించాలి. మనిషి ధర్మాన్ని వదలి అధర్మాన్ని పట్టుకొన్నపుడు, అతనికి తాత్కాలికంగా సుఖం, సంతోషం కల్గినా, దాని ఫలితము ప్రకృతి మీద పడుతుంది. మనుష్యులలో అధర్మగుణము ఎక్కువైతే ప్రకృతి కూడా క్రమము తప్పతుంది. ప్రకృతి కూడా అధర్మంగా ప్రవర్తిస్తుంది. అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి, అధిక ఉష్ణోగ్రత, అధిక మంచు కురవడం యిలా ఎన్నో జరిగి మానవజీవితం అస్తవ్యస్తంగా మారుతుంది. అపుడు మానవులు భగవంతునికి దయలేదు అంటారు.

నియమ ఉల్లంఘన చేసినది మనిషి. మరల ఆ మనిషే భగవంతునికి దయ లేదని వాపోతాడు. నియమోల్లంఘన చేసినను, భగవంతుడు మన పట్ల దయ కలిగి వుండాలన్నది అత్యాశ, అవివేకము, తప్ప కూడా.

క్రమశిక్షణా రాహిత్యమే అత్యాశ, అవివేకానికి మూలము. ఎవరు కష్టపడినా

ఫరవాలేదు, తను మాత్రము కష్టపడకూడదన్న ఒక్క స్వార్థ భావము. క్రమశిక్షణా రాహిత్యానికి ఆధారమై ప్రపంచాన్ని మొత్తం అల్లకల్లోలంగా మారుస్తుంది.

మనము తప్పు చేసి భగవంతుని, యితరులను నిందించడం, కారణాలని భావించడం ఎంత వరకు సబబు?

ఇతరుల తప్పులు చూచే దానికి ముందు మనలో తప్పులున్నాయా అని ప్రశ్నించుకోవలసిన అవసరముందా? లేదా? ఆలోచించండి.

మనలోని కొన్ని అధర్మ భావాలు - గమనించండి :

1. కష్టపడకుండా ఎక్కువ డబ్బులు రావాలి. (పెద్దలు)
2. కష్టపడి చదవకపోయినా, పరీక్షలు బాగా వ్రాయాలి. ఎక్కువ మార్కులు రావాలి. (విద్యార్థులు)
3. తనకు లేనిది, యితరులకు ఉంటే సహించకపోవడం, వీలైతే వాటిని తస్కరించడానికి ప్రయత్నం చేయడం.

ఇలా చెప్పకుపోతే ఎన్నైనా చెప్పవచ్చు. ఆలోచించండి. మనము ధర్మంగా ఉండలేకపోవడానికి కారణాలేవి? భర్త అధర్మంగా సంపాదిస్తే ఆ సంపాదనను భార్య సమ్మతించవచ్చా? లేక అధర్మంగానైనా సంపాదించి కోర్కెలను తీర్చుకోండా మని భర్తను అధర్మంవైపు మరలించవచ్చా?

ఈ సంఘటనలన్నీ మనలో, మన చుట్టుప్రక్కల జరిగే సాధారణ విషయాలు.

ధర్మోపన్యాసాలు ఇతరులు చేయాలా? లేక మనకు మనము యీ విషయాన్ని అతి ముఖ్యమైనదిగా, అతి జాగ్రత్తగా పరిశీలించాలా? ఆలోచించండి.

ధ్యానంలో కూర్చొని మనల్ని మనం పై ప్రశ్నలు వేసుకొంటే ఎన్ని కొరడా దెబ్బలు పడతాయో చూడండి. మన అంతరాత్మ కన్నా మించిన ధర్మబోధకుడు వేరెవరు ఉంటారు? చిల్లిచెంబు పట్టుకొని నీటిలో ముంచి చెంబు నిండా నీరు రావాలంటే కుదరదు.


చిల్లి అధర్మము. చిల్లిని పూడ్చండి. మనసును ఎప్పుడు ధర్మమార్గంలో ఉంచండి. అదే శిక్షణ - అలవాటు - సాధన.

ఇది చేస్తే మన మనసే, మన యిల్లే దేవాలయముగానో, ఆశ్రమంగానో మారుతుంది.

స్పందించండి - మీ భావాలను ప్రకటించండి. మనం ధర్మంగా వుంటేనే సుఖశాంతులు. వేరే మార్గం లేదు.







గణతంత్ర జూనియర్ల వ్యాసరచనల పోటీలో ప్రథమస్థానం

# ప్రపంచంలో చెట్లు లేకపోతే....

~ఎస్.సాయినందన్, 7వ తరగతి

ప్రపంచంలో చెట్లు లేకపోతే మనకు ముఖ్యంగా జీవించటానికి కావలసిన ఆక్సిజన్ స్వచ్ఛంగా దొరకదు. దీనివల్ల చాలామంది ప్రజలు మరణానికి గురి అవుతారు. చెట్టు మనకు నీడనిస్తుంది. ఇప్పటికీ కొంతమంది ప్రజలు ఎండకు తట్టుకోలేక వడదెబ్బతో మరణిస్తున్నారు. అంచేత చెట్లు లేకపోతే నష్టమే. ఇప్పడు చెట్లు మనకు లేకపోతే ఔషధాలు రావు. ఔషధాలు లేకపోతే అనేకానేక మంది చనిపోతారు. చెట్టు తనకు తాను బ్రతకాలి అనుకోకుండా పక్షులకు, ఇతర జంతువులకు, పురుగులకు అనేక జీవరాసులకు ఆశ్రయమిస్తుంది ఇప్పడు పట్టణాల్లో. అనేకమైన కాలుష్యాలు - శబ్దకాలుష్యం, వాయు కాలుష్యం బాగా వస్తాయి. అవి మన ఇంటి లోపలికి రాకుండా చెట్లు ఆపుతాయి. దీనివలన కూడా మనకు లాభం జరుగుతుంది.

చెట్టు తాను మరణించే వరకు స్వార్థం అన్న పదాన్నే అనదు, వినదు. ఇప్పడు ప్రపంచంలో అనేకమందికి స్వార్థం ఉంది కాని ఎవరికైనా తోడ్పడదాము అన్న బుద్ధే లేదు. చెట్టు మరణించిన తరువాత దాని కాండము వివిధ రకరకాలైన పనులకు ఉపయోగిస్తారు. పేదలు కట్టెల పొయ్యి వాడుకుంటారు. పొయ్యిలోకి కట్టెలుగా తోడ్పడతాయి చెట్లు.

మనం కూడా చెట్టును ఆదర్శంగా తీసుకుంటే దానిలో ఉన్న మంచి విషయాలు నేర్చుకోగలుగుతాం. నిస్వార్థం, ప్రేమ, దయ, ఓర్పు, సహనం ఇవి మనిషి అనేవాడు నేర్చుకోవలసిన ఆదర్శాలు. ఇవి నేర్చుకోలేకపోతే మనిషి అనేవాడు పశువుతో సమానం అవుతాడు చెట్టును కొడతాం, నరుకుతాం ఐనా తన ఔషధాలు,నీడ, పళ్ళు, ఇవ్వడం ఎప్పడైనా మానేసిందా! మానేయలేదు. పక్షులు తన శరీరం పైన గూళ్ళు కట్టుకున్న ప్రేమతో సహిస్తుంది ఏమనదు. వర్షం నుంచి రక్షిస్తుంది. తొర్రల ద్వారా, గూళ్ల ద్వారా నివాసయోగ్యత కల్పిస్తుంది. పక్షులు వచ్చి పురుగుల కోసం తన శరీరాన్ని పొడుస్తుంటే ఓర్పుతో, సహనంతో ఊరుకుంటుంది. మనం కూడా చెట్లలాగా బతకాలని, నేను అలా బతకుతానని ఆశిస్తూ సెలవు తీసుకుంటాను.

# ఆదిగురువు-దత్తప్రభువు

– స్వామీజీ

(గత సంచిక తరువాయి)

సుశీల కావలసిన ఏర్పాట్లన్నీ చేసింది. స్వయంగా స్వామే తన ఇంట భోజనం చేయడానికి వస్తున్నాడు. ఆమె పరమశ్రద్ధతో అన్ని వంటలూ చేసింది. ఆయన రానే వచ్చాడు. దంపతులు అతిథికి అర్ఘ్యపాద్యాలిచ్చి సత్కరించాడు. దత్తుడు "మరిద్దరు భోక్తలు కావాలి గదా - ఏరీ?" అని అడిగాడు. సుశీలకు ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. దత్తుడే స్వయంగా వస్తున్నాడనగానే ఆ ఆనందంలో మిగిలిన భోక్తల విషయమే మరచిపోయింది తాను. ఆమె పరుగున పెరటిలోకి వెళ్లింది. మధ్యం దిన మార్తాండుని వైపు చూచి చేతులు జోడించింది. "జగదేక బంధో! సర్వసాక్షీ, సర్వాత్మ స్వరూపా! నాపై అనుగ్రహించి, నా గౌరవం కాపాడు తండ్రీ! నా యింట జరిగే యీ పితృయజ్ఞానికి ద్వితీయ భోక్తవుగా విచ్చేయి స్వామీ!" అని ప్రార్థించింది. స్వకర్మాచరణలో ఎన్నడూ ప్రాలుమాలని దీక్షాపరుల ప్రార్థన కాదనగల శక్తి దేవతలక్కూడా ఉండదు. సూర్యుడు మానవరూపం ధరించి దిగి వచ్చాడు. సుశీల అగ్నిహోత్రుని ఎదుట నిలబడింది. "స్వామీ, హవ్య వాహనా, వైశ్వానరా! తరతరాలుగా యీ యింట వెలసిన కులదైవానివి నీవు. వెంటనే దయతో భోక్తవుగా వేంచేయి తండ్రీ!" అని ప్రార్థించింది. అగ్ని భగవానుడు కూడా సాక్షాత్కారించాడు. శ్రాద్ధకర్మ చక్కగా శాస్త్రోక్తంగా జరిగింది. భోజనానంతరం శ్రీదత్తుడు దంపతులను ఆశీర్వదించి, వారికి అత్యద్భుత మహిమ గల ఒక మంత్రం ఉపదేశించాడు. దీనిని ఉచ్చరించటం వలన విష్ణుదత్తునికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కీర్తి లభిస్తాయని చెప్పాడు. అంతేకాక అనంతమైన శక్తులు, సమర్థతా కూడా కలుగుతాయని వరమిచ్చాడు. విష్ణుదత్తుడు "స్వామీ! నేను అతి మామూలు మనిషిని. నేనెక్కడ - తమ దర్శన మెక్కడ! ఇటువంటి సౌభాగ్యం నాకు లభించడానికి కారకుడు బ్రహ్మరాక్షసుడు. నీ అనుగ్రహం వలన అతనికి ఈ జన్మ అంతరించిపోతే - అది నాకెంతో ఆనందం తండ్రీ!" అని ప్రార్థించాడు. దత్తుడు "తథా2స్తు!" అని బ్రహ్మరాక్షసునికి విముక్తి





కలిగించి అదృశ్యమైపోయాడు.

నాటినుండీ విష్ణుదత్తుడు భార్యతోసహా క్రమం తప్పకుండా మంత్రజపం చేస్తూ ఎంతో శక్తి సంపాదించాడు. కానీ, ఆ శక్తిని అతడు స్వప్రయోజనాలు కోసం కాక ఆర్తులూ, దు:ఖితులూ అయిన వారికి మేలు చేయడానికే ఉపయోగించేవాడు. అదెలాగో రెండుదాహరణలు చూద్దాం.

ప్రతిష్ఠానపురంలో ఒక విప్రుడుండేవాడు. అతనికి లేకలేక ఒక కుమారుడు జన్మించాడు. ఆ కొడుకు అందరిలాగే ఉంటే ఆనందం కలిగేది తల్లిదండ్రులకు. కానీ అతడు చాలా మందకొడిగా, స్తబ్ధంగా ఉండేవాడు. ఆటా, పాటా, స్నేహితులు- వారితో మాటామంతీ ఏమీ లేవు. ఇక చదువుసంధ్యల సంగతి చెప్పేదేముంది! కనీసం ప్రవర్తనైనా సరిగా ఉందా - అదీ అంతంతమాత్రమే. శుభ్రత, చురుకు, వినయం ఏవీ లేవు. ఈ దశ చూచి తల్లిదండ్రులు ఎంతో చింతించారు. గ్రహదోషాలకు శాంతులన్నారు. హోమాలన్నారు, తీర్థక్షేత్రాటనాలన్నారు. వైద్యాలన్నారు - ఏం చేసినా పిల్లవాడిదదే ధోరణి - ఏ మార్పూ లేదు. వారూ, వీరూ అనగా విష్ణుదత్తుని గురించి విన్న ఆ దంపతులు పిల్లవాడిని తీసుకొని ఆయన దర్శనానికి వెళ్లారు. ఆ బిడ్డ ఈయన్ని చూస్తూనే వికసితమైన ముఖంతో ఆయన దగ్గరే కూర్చున్నాడు కదలకుండా. తల్లిదండ్రులు ఆపాటి మార్పుకే పొంగిపోయారు. విష్ణుదత్తుని మంత్రబలానికి ఆ పిల్లవాడి నిజస్థితి గోచరమైంది. తల్లిదండ్రులను అనుష్ఠానం పూర్తి చేసుకు రమ్మని పంపాడు. ఆ పిల్లవాడిని ఆప్తంగా చూస్తూ "స్వామీ, తమరెవరు? ఏ కారణాన ఈ జన్మ ఎత్తవలసి వచ్చింది? నాకు మీ దర్శనభాగ్యం కలిగించిన కారణం ఏమిటో సెలవీయండి" అని అడిగాడు. ఆ పిల్లవాడు విరగబడి నవ్వాడు. "నేను సర్వవ్యాపకుడిని. ఒకచోట నుండీ పోవటం - ఒక చోటికి రావటం ఏమిటి? చిదానంద స్వరూపమైన మహదాత్మను. కార్యకారణాలన్నిటికీ అతీతుడను. నాకు కారణాలేమిటి?" అన్నాడు.

విష్ణుదత్తుడు పొంగిపోయి "స్వామీ, తామన్నది సత్యం. ఆది మధ్యాంతరహితమైన ఆత్మకు రాకలూ లేవు - పోకలూ లేవు. అయితే, ఒక్కమాట! నీవు ప్రపంచమంటే భయపడుతున్నావు, మళ్లీ బంధువులు, బలగం అంటూ సంగాలలో

పడిపోతావేమోనని ఓ అనుమానమా? అభిమానం త్యజించటం నేర్చిన వాడికి ఇక బంధమెలా కలుగుతుంది? నీవు జీవన్ముక్తుడివి. కనుక, ఎటువంటి ఆచారాలు పాటించకుండా ఇలా ఉన్నావు. కానీ సామాన్యులకు, అల్పజ్ఞులకు అలా అన్పించదు. ఆచారాలు విడిచిపెట్టి యథేచ్ఛగా ఉంటే జీవన్ముక్తులవుతామనుకొనే ప్రమాదం ఉంది. సదాచార సంపన్నుడవై, కర్తవ్య కర్మ చేసి, ఫలితం దైవదత్తం చేసి, ధ్యాన నిష్ఠాగరిష్ఠుడవై సాధన చేసి ఇంత వాడివయ్యావని వాళ్ళు అనుకోరు. అన్నీ వదిలేస్తే యింతవుతామనుకుంటారు. అందుచేత నీవు ఆచారాలు మన్నించవలసిందే. అలా అయితే ఏదో బంధం అతక్కుంటుందని అనుకోకు. నీవొక ప్రక్క అద్వితీయాత్మననుకొంటున్నావు గదా! ఇంకొకరెవరైనా ఉంటే గదా బంధం! ఇక నీకేం భయం? శ్రేష్ఠులైనవారు ఏది చేస్తే సామాన్యులు దాన్నే ఆదర్శంగా తీసుకొనే ప్రయత్నం చేస్తారు. నీవంటివారు మార్గదర్శకంగా ఉండాలి గనుకనూ, నీ తల్లిదండ్రులకు దు:ఖం కలిగించకుండా ఉండటం కోసమూ కూడా నీవు జనులందరిలాగా జీవిస్తున్నట్లు కనిపించవలసిన అవసరం ఉంది గదా! ఆలోచించి నిర్ణయించుకో!" అన్నాడు. కుర్రవాడు ఆ పలుకులు విని చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

విష్ణుదత్తుని భార్య అతన్ని తీసుకువెళ్లి స్నానం చేయించి, భోజనం పెట్టింది. పిల్లవాడు బాగైపోయాడని అతని తల్లిదండ్రులెంతో పొంగిపోయారు. అటుపైన అతడు చిరకాలం మాతాపితృ సేవ చేసి వారి అనంతరం సన్న్యసించాడు. ఆ విధంగా విష్ణుదత్తుని మంత్రబలం ఆ కుటుంబాన్ని రక్షించింది.

మరొక సందర్భంలో పీడాతురుడనేవాడు అనేకానేక వ్యాధులతో ముఖ్యంగా క్షయ వ్యాధితో అల్లాడుతుండగా - విష్ణుదత్తుడు వాడినీ, వాడి భార్యనూ కూర్చుండ బెట్టి పన్నెండు సంవత్సరాలపాటు ఏకదీక్షగా వ్రతాలు చేయించాడు. తత్ఫలితంగాను, విష్ణుదత్తుని మంత్రబలంతోను, పీడాతురుడికి రోగ పీడ వదిలిపోవటంతోపాటు చక్కని దైవభక్తి, సద్బుద్ధులు కలిగాయి కూడా. ఆ విధంగా విష్ణుదత్తుడు తన జీవితమంతా అనుష్ఠానపరుడిగా గడిపి, ఎందరి జీవితాలనో తన మంత్రబలంతో చక్కదిద్ది, చివరికి సాయుజ్యం పొందాడు.

**(సశేషం)**





# ఇది నా గడ్డ

(గణతంత్ర దిన సందర్భంగా జరిగిన కవితల పోటీలో ప్రథమస్థానం పొందిన కవిత)

~ కె.అనిల్, 10వ తరగతి

నేను పుట్టిన భరత భూమికి ముందుగా కైమోడ్పులు
నేను ఏర్చికూర్చిన ఈ అక్షరాలే పూలదండలు

సిరులనిచ్చే కన్నతల్లి నా భారతావని
శుభముగూర్చే కల్పవల్లి నా భారతావని

భగవంతుని గుండెల్లో బంధించిన నా తల్లి భారతావని
మా అమ్మ నవ్వితే ఉప్పొంగెను నదులన్నీ
మా అమ్మ గుండె నిబ్బరానికి గర్వించెను కొండలన్నీ.

ఈ తల్లి వీరమాతల ధాత్రి,
త్యాగుల యోగులకిది అధినేత్రి.

ప్రకృతిని శాసించిన పతివ్రతలు పుట్టిన ఇల్లు నా తల్లి,
ఆకాశం నుండి దేవతలు నిండు వేడుకలతో వేం చేసిన ధాత్రి నా తల్లి

కరుణతో అందాలు చిందు నిండు జాబిల్లి నా తల్లి
మండు వేసవిలో కూడా పరిమళాలు చిందే మల్లి - నా తల్లి

నేను పుట్టిన యీ భరతభూమికి ముందుగా కైమోడ్పులు
నేను ఏర్చికూర్చిన ఈ అక్షరాలే పూదండలు.



# లక్ష్మణుని తల్లి

– 'రామచరిత మానసం' నుండి

లక్ష్మణునకు యీ సమాచారమంతయు తెలియగానే వ్యాకులమనస్కుడై విచారవదనుడై, పరుగుపరుగున అన్నకడకు వచ్చెను. శరీరము కంపించుచుండగా సజలనయనుడై, ప్రేమవిహ్వలుడై శ్రీరాముని చరణములను పట్టుకొనెను. లక్ష్మణుడేమియు మాట్లాడలేకపోయెను. కేవలము నిలబడి చూచుచుండెను. నీటిలో నుండి బయటికి తీయబడిన చేపవలె అతడు దీనముగా గిలగిలలాడుచుండెను. అతడు మానసికముగా విచారగ్రస్తుడై ఆందోళన పడసాగెను. "భగవంతుడా! ఏమి కానున్నది? మా సుఖము, పూర్వ పుణ్యములు పూర్తియైనవా? శ్రీరామచంద్రుడు నాకేమి ఆజ్ఞ యిచ్చును? నన్ను ఇంటి వద్దనే ఉంచునా? లేక వెంటదీసుకొని పోవునా?" ఈ విధముగా లక్ష్మణుడు విచారవదనుడై దేహగేహ పరివారముల యందు ఆసక్తిని, మమకారమును వదలి, చేతులు కట్టుకొని నిలబడియుండుట చూచి, నీతిశాస్త్ర నిపుణుడు, స్నేహశీల సుఖసాగరుడైన శ్రీరాముడిట్లు పలికెను - "నాయనా! ప్రేమాతిరేకమున నీవు అధైర్యమునకు లోనుకావలదు. నీవు యిచ్చట వుండుట వలన పరిణామము శుభమే అగునని ఎరుంగుము.

సహజముగా తల్లిదండ్రుల హితోక్తులను, గురువుల ఉపదేశములను, ప్రభువుల ఆజ్ఞలను ఔదల దాల్చు వాని జన్మయే సార్థకము - అట్లు చేయని వాని జన్మ నిరర్థకము.

సోదరా! దీనిని మనసులో ఉంచుకొని, నా సూచనను పాటించి, తల్లిదండ్రులను సేవించుచు ఇక్కడనే ఉండుము. భరత శత్రుఘ్నులను ఇంటలేరు. మహారాజుగారు వృద్ధులు, నా గురించి వారు చాలా దు:ఖితులగుచున్నారు. ఇట్టి స్థితిలో నేను నిన్ను గూడా వనమునకు తీసికొనిపోయినచో అయోధ్య అన్ని విధముల అనాథయగును. గురువుగారు, తల్లిదండ్రులు, ప్రజలు, పరివారము అందరును దుర్భరమైన దు:ఖమును పొందెదరు. కావున నీవిచ్చటనే





యుండి అందరిని ఓదార్చి, సంతుష్టులను జేయుము. లేనిచో సోదరా! గొప్ప తప్పిదమే యగును. తనను ప్రేమించు ప్రజలను దు:ఖము పాలుచేయు రాజు నిశ్చయముగా నరకమునకే పోవును. కావున నాయనా! దీనిని నీ ధర్మముగా భావించి యిచటనే యుండుము". లక్ష్మణుడు ఈ మాటలను విని, అత్యంత వ్యాకులుడాయెను. శ్రీరాముని అనునయ వచనములు చల్లనివేయైనను మంచుతాకిడికి కమలమువలె ఆ వచనములలోని తీవ్రతకు లక్ష్మణుని ముఖము వాడిపోయెను.

ప్రేమాధిక్యమున లక్ష్మణుడు సమాధానమీయలేకపోయెను. కాని యెంతో వ్యాకులుడై శ్రీరాముని చరణములపైబడి పలికెను. "ప్రభూ! నేను సేవకుడను, మీరు నా ప్రభువులు. మీరే నన్ను త్యజించినచో నేనేమి జేయగలను?"

స్వామీ! మీరు నాకు చాలా మంచి ఉపదేశమునే యిచ్చితిరి. కానీ, నేను దుర్బలహృదయుడనగుట వలన దానిని అనుసరించుట కష్టతరము. ధీరులు, ధర్మనిరతులునైన శ్రేష్ఠులు మాత్రమే వేద, నీతిశాస్త్ర ప్రబోధములకు అధికారులు. నేను ప్రభువుల వారి ప్రేమతో పెరిగిన పసిబాలుడను. హంస ఎప్పుడైనను మందరాచలమును, మేరుపర్వతమును ఎత్తగలదా? ప్రభూ! నిక్కము వచించుచున్నాను, విశ్వసింపుడు. మిమ్ము దప్ప తల్లిని, తండ్రిని, గురువును ఎవ్వరినీ నేనెరుగను. ఓ దీనబంధూ! అంతర్యామీ! వేదములు ప్రవచించిన స్నేహబంధములు, ప్రేమ, విశ్వాసమును, అన్నియును ఈ జగత్తున నాకు మీరే. యశమును, ఐశ్వర్యమును, సద్గతిని కోరుకొను వానికి ధర్మమును, నీతిశాస్త్రమును బోధింపవలెను. కానీ, నాకు అవియేమియు వద్దు. ఓ కృపా సింధూ! మనోవాక్కర్మలచే మీ యందనురక్తుడై యుండు వానిని త్యజింపదగునా?".

కరుణాసింధువైన శ్రీరామచంద్రుడు తన సోదరుని వినయపూర్వక కోమల వచనములను విని, ప్రేమాతిరేకముచే అతడు కలత చెందినాడని యెఱింగి, అతనిని హృదయమునకు హత్తుకుని అనునయించెను.

తరువాత రాముడిలా అన్నాడు - "సోదరా! నీవు వెళ్ళి తల్లిగారి యనుజ్ఞను తీసుకొని రమ్ము. త్వరగా వనములకు వెళ్ళుదము". రఘునాధుని పల్కులను

విని, లక్ష్మణుడు సంతసించెను. గొప్ప సంకటము తొలగి, ఎంతో లాభము చేకూరినట్లు అతడు హాయిననుభవించెను. అంధునకు చూపు వచ్చినంత ఆనందముతో అతడు తల్లి సుమిత్రకడకు చేరెను. ఆమె పాదములకు ప్రణమిల్లెను. కాని అతని మనస్సు రఘుకులానందప్రదుడగు శ్రీరాముని పాదముల మీదను, జగజ్జననియైన జానకీదేవి చరణకమలములయందును ఉండెను. చింతాకులుడైన లక్ష్మణుని గాంచి సుమిత్రకారణమడిగెను. లక్ష్మణుడు జరిగిన కథయంతయును తెల్పెను. లక్ష్మణుడు తెల్పిన కఠినమైన వనవాస వార్తను విని, అడవిలో నలువైపులా అగ్నిజ్వాలల జూచిన లేడివలె ఆమె భయకంపితమయ్యెను. వాత్సల్య కారణముగ తల్లి తన కోరికకు కాదనుననియు, అనర్థము వాటిల్లుననియు లక్ష్మణుడు భావించెను. కనుక అనుజ్ఞనడుగుటకు వెనుకాడెను. మనస్సులో, "భగవంతుడా! వనములకు వెళ్ళుచున్న శ్రీరాముని అనుసరించుటకు తల్లి అనుమతించునో లేదో?" అని ఆందోళన చెందెను.

సుమిత్రాదేవి శ్రీ సీతారాముల రూపములను, సౌశీల్యములను, స్వభావములను తలంచుకొని, అట్లే రాజునకు వారిపైగల ప్రేమానురాగములను గూడ స్మరించి, తన తలబాదుకొనుచు "కైకేయి ఆయువు పట్టుపై పెద్దదెబ్బ కొట్టినది" అని తలచెను.

సహజముగ మంచి హృదయము గలదియగుటచే సుమిత్ర అది శోకమునకు తగిన సమయముగాదని గ్రహించి, ధైర్యము వహించి, మృదువచనములతో యిట్లనెను. "నాయనా! వైదేహియే నీకు తల్లి, ప్రేమస్వరూపుడైన శ్రీరాముడే నీకు తండ్రి, రాముడున్నచోటే అయోధ్య, సూర్యుడు వెలుగొందుచున్న సమయమే పగలు. నిజముగా సీతారాములు వనవాసమునకు పోవుచో నీకు అయోధ్యతో పనిలేదు. గురువు, తల్లిదండ్రులు, సోదరుడు, దేవతలు, ప్రభువు- వీరందరిని ప్రాణతుల్యముగా భావించి సేవింపవలెను. కానీ, శ్రీరామచంద్రుడు ప్రాణముల కంటెను ప్రీతిపాత్రుడు. అందరికిని ఆత్మయైనవాడు, నిస్స్వార్థ మిత్రుడు, శ్రీరామునియెడ భక్తిశ్రద్ధలు గలవారే ఈ ప్రపంచమున అందరికినీ పూజ్యులు. పరమప్రియులు. దీనిని మనసులో నిలుపుకొని, అన్నతో నీవును వనములకు





వెళ్ళుము. ఈ జగత్తులో నీ జన్మసార్థక మొనర్చుకొనుము.

కుమారా! నీ చిత్తము సర్వదా శ్రీరాముని చరణములకు నెలవు అగుట వలన నీవు ఎంతో భాగ్యశాలివి. నీకు తల్లినగుట వలన నేను మిక్కిలి అదృష్టవంతురాలను. నీ రామభక్తికి నివాళులర్పించుచున్నాను.

రామభక్తి సామ్రాజ్యము ఏ మానవుల కబ్బెనో మనసా!

ఆ మానవుల సందర్శనమత్యంత బ్రహ్మానందమే. ॥రామ॥

శ్రీరఘునాధునకు భక్తుడైన పుత్రునిగన్న స్త్రీయే నిజముగా భాగ్యశాలి రామునికి విరోధి యైన పుత్రుని గనుటకంటెను గొడ్రాలుగా నుండుటయే మేలు. పశువువలె అట్టి వానికి జన్మనిచ్చుట వ్యర్థము. శ్రీరాముడు వనములకు వెళ్ళుట నీయదృష్ట ఫలమే. వేరే కారణము లేనేలేదు. నాయనా! శ్రీ సీతారాముల పాదపద్మములపై నిసర్గమైన ప్రేమయుండుట పురాకృత సుకృతఫలమే. రాగము, రోషము, ఈర్ష్య, మదము, మోహము - వీటికి స్వప్నములో కూడా వశము కారాదు. అన్ని రకముల వికారములను త్యజించి, మనోవాక్కర్మలచే సీతారాములను సేవింపుము. వారు నీకు తల్లిదండ్రులుగా ఉన్నప్పుడు వనములోనే నీకు సుఖ శాంతులు లభించును. పుత్రా! శ్రీరామునికి క్లేశములు కలుగకుండా నీవు మెలగ వలెను. ఇదియే నా ఉపదేశము.

"నాయనా! నీవు తోడుగా ఉండుట వలన సీతారాములు సుఖముగా నుండవలెను. వారు తల్లిదండ్రులను, ప్రియ పరివారమును, నగర సుఖములను మరచిపోవలెను. ఇదియే నా ఆదేశము". (తులసీదాసు చెప్పుచున్నాడు) ఈ విధముగా సుమిత్రాదేవి మన లక్ష్మణస్వామికి ఉపదేశించి, వనవాస గమనమునకు అతనిని అనుమతించెను. "శ్రీ సీతారాముల చరణములపై నీ శ్రద్ధ ప్రగాఢ ప్రేమ నిత్యనూతనముగా ఉండుగాక" అని దీవించెను.

లక్ష్మణుడు మాతృపదములకు మోకరిల్లి, భాగ్యవశమున వల నుండి తప్పించుకొనిన జింకవలె భయపడుచు వెళ్లెను. (మరియే విఘ్నము వచ్చి పడునోయని భయము.)

# సమయం అమూల్యం

- స్వామీ జగదాత్మానందగారి "జీవనవికాసం" నుండి

ప్రముఖ ప్రజానాయకుడు, ఉద్యమనేత అయిన ఒక పెద్దమనిషిని వారి ఆఫీసులో కలుసుకున్నాను. వారి గదిలోని బల్లపై ఒక చివర "నా సమయం అమూల్యమైనది" అనే చిన్న బోర్డును ఉంచారు. ఇదేమిటి? వారి సమయం అమూల్యమైతే నా సమయం అమూల్యం కాదా? అని ఆలోచిస్తూ మరలా అదే వాక్యం చదివాను. కాదన్నది ఎవరు? తన సమయం అమూల్యమైనది అన్న విషయం తెలియని కొందరు ఇతరుల సమయాన్ని పాడు చేయడానికి సంకోచించరు. అటువంటి వారికి హెచ్చరికగా వారు ఆ మాటను వ్రాసి ఉంచారు.

నా సమయం అమూల్యం అని వ్రాసి ఉంచుకొన్నవారు రోజు 16 గంటలు మించి పనిచేయగలరు. పెద్ద సంస్థ ఎదుర్కొనే కొన్ని వందల సమస్యలకు పరిష్కారం చూపగలరు. అక్కడ వారు వ్రాసిన మాటల అర్థం వారి జీవితంలో ఆచరించి ఉపదేశించినట్లుండేది.

మీరు మీ మనస్సులో ఆ మాటను వ్రాసిన ఒక బోర్డును వేలాడదీయండి. నిజంగా మీ సమయం అమూల్యమైంది.

ఒక్క చిన్నలెక్క చేయగలరా? ఒక ఏడాదికి ఎనిమిది వేల ఏడు వందలు గంటలు కదా! ఈ సమయాన్ని మీరెలా గడుపుతున్నారో కాసేపు ఆలోచించండి. నిద్రకు ఇంత, పనికి ఇంత, ఆహారవిహారాలకు ఇన్ని గంటలు అని విభజించండి. ఒక పెన్సిలు తీసుకొని ప్రశాంతంగా కాగితంపై రాయండి. మీరు ఆశ్చర్యచకితులవుతారు.

ఎంత విరామకాలం ఉండేదీ మీకు అర్థం అవుతుంది. మరో ఆశ్చర్యం వేచి ఉంటుంది. అంత విరామకాలాన్ని మీరు ఎలా సార్థకపరచగలరో, వృథా చేయ గలరో మీకు తెలుస్తుంది. సమయం పట్ల దృష్టి పెట్టక, ధన సంపాదన మాత్రమే మంచిపని అని భావిస్తే మీకున్న అర్థశాస్త్ర జ్ఞానం సరైనది కాదని చెప్పవచ్చు. గుర్తుంచుకోండి. మీ సమయాన్ని సద్వినియోగం చేయడంపైనే మీ యశస్సు





ఆధారపడి ఉంటుంది.

ఒక రోజున మీరు ఒకటి రెండు గంటలు పిచ్చాపాటీ కబుర్లతోను లేదా ఏ పని లేకుండాను గడిపితే ఒక సంవత్సర అమూల్యకాలంలో మీరు సాధించ వలసిన అద్భుతం ఎలా మాయమవుతుందో ఆలోచించండి. గడచిన కాలం తిరిగి రాదు కదా! మీ జీవితం సుదీర్ఘమైనదిగా భావించి తరువాత చక్కదిద్దుకోవడం జరుగుతుందా? నిజమైన మితవ్యయకారుడి మనస్సులో పనికిరాని ఆలోచనలకు తావుండదు. పనికిరాని చర్చలలో మనమెందుకు పాల్గొనాలి? నిర్ణీతమైన సమయాన్ని ఏర్పరచుకొని మీరు కార్య నిమగ్నులు కండి. వస్టర్ చెప్పిన మాట మీరు మరువగలరా! మీరు ఇప్పటికిప్పడే జాగురూకులు కాకుంటే తర్వాత పశ్చాత్తాపపడవలసి ఉంటుంది. 'గడచిన ఈ దినం వెనుదిరిగిరాదన్న వాస్తవాన్ని గుర్తించు' అని డాంటే చాటాడు. నమ్మశక్యం కాని వేగంతో మన జీవితం గడచిపోతుంది. సెకనుకు పందొమ్మిది వేల మైళ్ల వేగంతో మన జీవితం సాగుతూ ఉంది. అంతరిక్షంలో ఈ దినం, ఈ క్షణం మాత్రం మన అమూల్యమైన సంపద. భూత భవిష్యాల చింతన మరచి ఈ క్షణంలో యశశ్శాలిగా బ్రతకడానికి మనం ప్రయత్నిద్దాం. అప్పడు మాత్రమే మన జీవి తానికి ఒక వెలుగు, ఒక వినూత్నత లభిస్తాయి. ఒక్కొక్కరోజు కలిసి సంవత్సరా లవుతాయి. ప్రతిదినం మనం చేసిన మంచి పనుల ఫలితం సంస్కారవంతమై వృద్ధి చెందుతుంది.

"మీరు గడ్డం ఎందుకు చేయలేదు?" అని ఎవరో జార్జ్ బెర్నార్డ్‌షా గారిని ప్రశ్నించారు. వారి సమాధానం ఇలా ఉంది - "గడ్డం చేసుకుంటే సమయం వ్యర్థమవుతుంది. నేను రోజుకు నాలుగు నిముషాలు వంతున జీవితంలో ఆరు నెలల కాలాన్ని మిగిల్చాను".

గడ్డపుధారులందరూ తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొంటారని చెప్పలేం. సమయం విలువను తెలుసుకొని చాలా జాగ్రత్తగా కాలాన్ని కొంతమాత్రమైనా వృథా చేసుకోకుండా చూడవలసిన బాధ్యత మన మీద ఉంది. అవును జీవితం చాలా దీర్ఘమైనది కాదు, సమయం అమూల్యం. తస్మాత్ జాగ్రత్త.

# మాతృసంస్థ కబుర్లు

డిసెంబరు 21వ తేదీ దత్త పూర్ణిమోత్సవం సాయిధామంలో కన్నుల పండువగా జరిగింది. ఉదయం పూజానంతరం దత్తవ్రతం, దత్త చరిత్ర పారాయణం జరిగాయి. ఆ రాత్రి బాబా చరిత్రలో వారు మూడు రోజులపాటు తనువు విడిచి వెళ్ళి తిరిగి వచ్చి, లేచి కూర్చున్న కథ పారాయణ, విశ్లేషణ జరిగాయి.

జనవరి 1వ తేదీ ఆంగ్లసంవత్సరాది సందర్భంగా వచ్చిన వేల భక్తులతో హడావుడిగా గడిచింది. అర్ధ సంవత్సరపు పరీక్షల అనంతరం సంక్రాంతి సెలవులు ప్రకటించటంతో కాస్తవెసులుబాటు చిక్కింది. కానీ, బడికొక్క దానికేగా సెలవు. గుడికీ, మడికీ, గోశాలకూ, పొట్టలకూ దేనికీ సెలవు లేదుగా! అంచేత హడావుడి తగ్గలేదు. గొబ్బెమ్మలు పెట్టటం, అందుకోసం వన్నెవన్నెల రంగవల్లులు తీర్చటం, ఆపైన పూజలు, పారాయణలు వగైరాలతో తీరికలేని పని. అక్కయ్యలు అప్పలు చేస్తోంటే తమ్మయ్యలు వాటిని అవజేసే పని ఒకటి ఉంటుంది గదా!

జనవరి 9వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరి ఓల్డ్ బోయిన్‌పల్లి లోని శ్రీమతి ఇందిరగారి యింటికి వెళ్ళాము. అక్కడ వారి సత్సంగ హాల్‌లో "బాలప్రతిభ" పేరిట బాలసంస్కారకేంద్రానికిప్రారంభోత్సవం జరిగింది. యాభైమంది పిల్లలు (పదిహేను మంది పెద్దలు కూడా) వచ్చి ఉత్సాహంగా అందులో పాల్గొన్నారు. అన్నట్లే మూడు నిముషాలలో ఓ శ్లోకం నేర్చుకున్నారు. కథకు చక్కగా రెస్పాండయ్యారు. దాని మీది చర్చలో పాల్గొన్నారు. భజన నేర్చుకున్నారు. పన్నెండు గంటలకల్లా అది ముగించి, శ్రీమతి ఇందిరగారి కుటుంబం యిచ్చిన ఆతిథ్యం స్వీకరించి ఇంటికి మరలాము.

జనవరి 14 ఉదయం భోగిపండుగ. గల్లీ అన్నయ్యకు ఇష్టమైన లడ్లు, చాక్లెట్లు, అరటిపళ్ళ 'శివమహేశ్వరా' పాడి మరీ సమర్పించి వచ్చారు పిల్లలు. 15వ తేదీ సంక్రమణ దినం. అతిథి అభ్యాగతులతో కలిసి వేడుక. 16 ఆదివారం గనుక, గోపూజోత్సవం, ఆటలతో గడిచింది.

జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీ సాయి విద్యాధామంలో





పతాక వందనం జరిగింది. ఆ సందర్భంగా వారం రోజుల ముందు నుండీ ఆటల పోటీలు కబడ్డీ కోకో, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్ వంటివి చిన్నపిల్లలకు రన్నింగ్ రేస్, స్కిప్పింగ్, మ్యూజికల్ ఛైర్స్ వంటివి - యింకా చాలా పెట్టారు. చేతివ్రాత, పద్య పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, వక్తృత్వం, కథా కథనం, డ్రాయింగ్, కవితా రచన వంటి విషయాలపై పోటీలు సాగాయి.

26వ తేదీ ఉదయం విద్యార్థులంతా బారులుతీరి మార్చింగ్‌తో భారతమాత మండపం వరకు వెళ్ళి, అమ్మకు నమస్కారం చేసి వచ్చాక ప్రోగ్రామ్ ప్రారంభమైంది. పరమపూజ్య గురుదేవులు జ్యోతి ప్రజ్వలనం చేసాక, రిటైర్డ్ తెలుగు లెక్చరర్ శ్రీ ఎ. నరసింహా రెడ్డిగారు పతాకావిష్కరణ చేసారు. "సిర్ పర్ హిమాలయ్ కా ఛత్ర్ హై - హాథోం మే వేదోంకా పత్ర్ హై" అన్న పాటతో కార్యక్రమం ఆరంభమైంది. ఎన్నెన్నో పాటలు, కథలు, కవితలు, నాటికలు, నాట్యాలు కన్నులపండువుగా జరిగాయి. చిన్నారి బాలల చేసిన నాట్యాలు, కోలాటాలు ఆకట్టుకొన్నాయి. హాస్యం, వ్యంగ్యం నిండిన నాటికలుగా సమాజం, సరిలేరు నాకెవ్వరూ బాగా రాణించాయి. "చల్లని మనసు" చక్కని సందేశాత్మక నాటికగా రాణించింది. కాకి, చీమ-భామ, శాంతినికేతన గీతం' అనే పిల్లల నాట్యాలు చక్కగా మెప్పించాయి.

మార్చి ఫాస్ట్‌లో త్రివర్ణ పతాక వర్ణాలు వచ్చేలాగా విద్యార్థులు దుస్తులు ధరించటం ముచ్చట గొలిపింది.

గత రెండు సంవత్సరాలుగా పాఠశాల తరఫున ఎస్.ఎస్.సి. పరీక్షల్లో సర్వప్రథములుగా వచ్చిన చి॥ ఆర్.దీపిక, చి॥ ఎన్.మౌనికలకు స్కూలు ఫస్టు బహుమతులతో ప్రారంభమై బహుమతి ప్రదానం జరిగింది. విశిష్ట సేవా బహుమతులు పదవ తరగతి విద్యార్థులు చిరంజీవులు బి.కొండల్‌రావు, కె.అనిల్‌లకు దక్కాయి. టీచర్లందరూ ఏకగ్రీవంగా వారి పేర్లు చెప్పటం ఆనందదాయకం.

మా యీ కార్యక్రమానికి తమంతటతామై వచ్చి, ఆసాంతం ఉండి, పిల్లల కోసం మిఠాయిలు తెచ్చి అందించడమేగాక- పాఠశాలకు కావలసిన మైకుల వంటివి సమకూరుస్తామని మాట యిచ్చిన కాప్రా లయన్స్‌క్లబ్ సభ్యులందరికీ మా పిల్లల తరఫున శ్రీ సాయిరక్ష.

(గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెట్టిన పోటీల్లో
ప్రత్యేక బహుమతి గెలిచిన వ్యాసం)

# ఆదర్శం-నేటి సమాజం

- ఎన్. రాజేశ్వరి

ప్రతి ఒక్క మనిషి ఒక ఆదర్శాన్ని కలిగి ఉండాలి. స్వామి వివేకానంద చెప్పినట్లుగా ఆదర్శం ఉన్న మనిషి 1000 తప్పులు చేస్తే ఆదర్శం లేని వారు 10000 తప్పులు చేస్తారు. కాబట్టి ప్రతివారూ ఆదర్శం కలిగి ఉండాలి.

నేటి సమాజంలో అందరు యువతీయువకులూ మంచి ఆదర్శాలు కలిగి ఉండటం లేదు. సినిమాలు చూడటం వల్ల ఆ సినిమాల హీరోలని, హీరోయిన్లని ఆదర్శమూర్తులుగా తీసుకొని వాళ్ళు ఎంత ఎత్తు ఎగిరితే అంత ఎత్తు ఎగరటం, వాళ్ళు ఏది చేస్తే అదే చేయటం చేస్తున్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆదర్శం కలిగి ఉంటే మన దేశం యింకా ఎంతో గొప్పగా తయారవుతుంది. మన దేశంలో పూర్వం ఎంతోమంది సత్పురుషులు, మహానుభావులు ఉన్నారు. పూర్వం అందరికీ ఏదో ఒక మంచి ఆదర్శం ఉండే ఉంటుంది. అందుకే వాళ్ళు మంచి మహానుభావులు కాగలిగారు. నేటి సమాజంలో రాజకీయ నాయకులే సరిగా ఉండకపోతే ఆ దేశప్రజలు ఎలా సరిగుంటారు? యథారాజా తథా ప్రజా. ప్రజలు కూడా ఆ రాజకీయ నాయకులలాగే లంచం, అన్యాయం, డబ్బులు దోచుకుపోవటం, మోసం చేయటం యిలాంటివి అన్నీ చేస్తుంటారు. ఇప్పుడు ఎక్కడో ఒక్కరు తప్పితే చాలామంది ఇలాగే ఉంటున్నారు. సుభాస్‌చంద్రబోస్, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ - వీళ్లంతా మనకు ఆదర్శమూర్తులు కావాలి. స్వరాజ్యానికి షష్టి పూర్తి అయిపోయినా మనం ఇప్పటికీ బానిస బ్రతుకులే బ్రతుకుతున్నాం. పూర్వులను ఆదర్శమూర్తులుగా తీసుకొని మన దేశాన్ని రక్షించుకుందాం. బయటదేశాల నుంచి వచ్చినవారెవరో మనల్ని పరిపాలిస్తాం అని అనడానికి రెండు కారణాలు - ఒకటి ఆదర్శం లేకపోవటం, రెండు ఐక్యత లేకపోవటం. కాబట్టి నేటి అవలక్షణాలను పారద్రోలాలి అంటే ఖచ్చితంగా మనం ఆదర్శం కలిగి ఉండాలి. ఒక ఆదర్శం మనం ఎన్నుకొంటే మన మనసులో ప్రతి నిముషం దాని గురించే ఆలోచించాలి. ఆ ఆదర్శంలోని మంచి లక్షణాలు మనలోకి రావచ్చు. ఫలితంగా మనం కూడ ఇంకొకరికి ఆదర్శమూర్తులం కావచ్చు. కాబట్టి మనం ఆ ఆదర్శం గురించే కలలు కనాలి. ఆ ఆదర్శం గురించే తపించాలి. అలా మనం చేస్తే మనం దేశాన్ని బాగుచేయటానికి ఎంతో కాలం పట్టదు. మనం ఒక ఆదర్శం కలిగి ఉంటే తక్కువ తప్పులు చేయటానికి అవకాశం ఉంటుంది. సత్యం, ధర్మం, అహింస, దానం, సేవ -ఏదో ఒక ఆదర్శం ఏర్పరచుకోవాలి మనం. ప్రతి ఒక్క రాజకీయ నాయకుడికి కూడా ఒక ఆదర్శం ఉంటేగాని దేశం బాగు పడదు. ఒక రాజకీయ నాయకుడు లాల్‌బహదూర్ శాస్త్రిలాగా, ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌లాగా ఉండాలి. ఈ దేశంలో ఉండే ప్రతి సత్పురుషుని నుండి మనం ఒక్కొక్క మంచి విషయమైన తీసుకోవాలి. వాళ్ళు ఎక్కడున్నా వాళ్ళ ఆశీస్సులు మనకుంటాయి.

ప్రస్తుతం నేటి సమాజంలో యువతీ యువకులలో ఎక్కువమంది ఆదర్శాలకు విలువలు ఇవ్వటం లేదని అన్పిస్తుంది. ఫ్యాషన్లు, విలాసాలకు లోనవుతున్నారు. కానీ ఎప్పుడైనా ఆదర్శంగా జీవిద్దాం అని అనుకోవటం లేదు. ఏ బైకు లెక్కి ఏ ఫీట్లు చేద్దామని తప్ప అవినీతిని ఎలా పారదోలదాం అని లేదు. మహనీయుల పుస్తకాలు చదువుతుంటే తప్ప ఇది సాధ్యం కాదు. అవి చదివి ప్రతివారూ ఉత్తేజితులై ఆదర్శవంతులైతే ఎందరో శివాజీలు, ఎందరో వివేకానందులు, ఎందరో వీరేశలింగాలు, మరెందరో రాణా ప్రతాప్‌లు తయారవుతారు. అప్పుడు మన దేశం స్వర్గతుల్యం అవుతుంది.

## వీక్షించండి - ఆలకించండి

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి మంగళ ప్రవచనం **'సాయివాణి' భక్తి ఛానెల్‌లో ప్రతి సోమవారం రాత్రి గం.8-30** ని.లకు ప్రసారమవుతున్నది. ఎటువంటి భేషజాలు, ఆడంబరాలు లేకుండా శ్రీ సాయి చరిత్రను విశేషాలతో, లోతుపాతులతో వివరిస్తున్న యీ కార్యక్రమం "సాయివాణి"ని చూడండి, వినండి, ఆలోచించండి, ఆచరించండి, తరించండి.